ఇంజనీరింగ్ సీట్ల లెక్క తేలింది

» జేఎన్టీయూకే పరిధిలో సీట్లు ఖరారు
» 2025-26 విద్యాసంవత్సరానికి 106 కళాశాలలకు గుర్తింపు
» ఇంజనీరింగ్‌లో 30వేల సీట్లకు అనుమతి
» 18 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు

7

భూ..కేర్ ఫుల్!



భూ పందేరానికి కూటమి ప్రభుత్వం చెక్

» భూ అక్రమాలకు చెల్లు
» కలెక్టర్ చేతిలో పాశుపతాస్త్రం
» కొత్త చట్టంతో రద్దుకు అవకాశం
» 1908 నాటి చట్టానికి సవరణ
» అసెంబ్లీలో ఆమోదించిన సర్కార్
» కోర్టు కెళ్లకుండానే పరిష్కారం
» భూ బాధితులకు శుభవార్త
» కబ్జాదారులకు చేదువార్త
» నాటి అక్రమాలతో మేలుకొలుపు

ఖాళీ జాగా కనబడితే చాలు.. అది ప్రభుత్వానిదా?.. ప్రైవేటుదా?..అనే విషయం అసలు పట్టించుకోరు.. ఆక్రమించేస్తారు.. ఠక్కున లింక్ డాక్యుమెంట్లు పుట్టిస్తారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డబ్బుల కట్టలు విసిరి ఆ భూమిని చుట్టబెట్టేస్తారు. బాధితులు లబోదిబోమన్నా కదలరు వదలరు.. గత ప్రభుత్వంలో కబ్జా అనేది ఒక వృత్తిగా అవతరించింది. జడ్జి రామకృష్ణ భూములు ఒక వైసీపీ నాయకుడు ఆక్రమించారని గగ్గోలు పెట్టినా ఏం చేయలేని పరిస్థితి. నాడు ఇలా ఎందరో బాధితులు తమ భూములు ఆక్రమించారని పోలీస్ స్టేషన్, కోర్టు మెట్లు ఎక్కిన వారున్నారు.. అయినా లాభం లేకపోయింది.. కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించిందో ఏమో కానీ.. భూ అక్రమాలకు ప్రభుత్వం చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది.

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం)

భూ అక్రమాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషను రద్దు అధికారం పౌర న్యాయస్థానాలకు మాత్రమే ఉండగా.. ఇప్పుడు ఆ అధికారం కలెక్టర్‌కి దాఖలు పరుస్తూ చట్టం అమల్లోకి వచ్చింది. ఆస్తుల రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగితే వాటిని రద్దు చేసే అధికారాన్ని కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీకి దాఖలు పరుస్తూ 1908 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రాష్ట్ర శాసన సభ ఆమోదం తెలిపింది. శాసన సభ ఆమోదించిన సవరణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ప్రభు త్వం జారీ చేసిన నోటిఫికేషన్ బుధవారం నుంచి అమల్లోకి వచ్చేసింది. వాస్తవానికి భూముల క్రయ, విక్రయాల సమయంలో సబ్- రిజిస్ట్రార్లు ఆ భూమి/స్థలానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలి. ఒక వేళ ప్రభుత్వానికి చెందిన లేదా నిషేధిత జాబితా (22ఏ)లో ఉన్న భూముల వివరాలను రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ల శాఖకు అందజేస్తుంది. ఆ జాబితాలో ఉన్న భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషను చేయడానికి వీల్లేదు. ప్రభుత్వ భూములను కాపాడడంలో కలెక్టర్‌కి ఎంత బాధ్యత ఉంటుందో.. సబ్-రిజిస్ట్రార్లకూ అంతే ఉంటుంది. అది వారి విధి కూడా. అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు రుజువైతే సబ్-రిజిస్ట్రారుకు మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష విధించే అవకాశాన్ని చట్టం కల్పిస్తోంది.కానీ చట్టాల్లో ఉన్న లొసుగులు, కోర్టుల్లో ఏళ్లకు తరబడి విచారణ నడవడం వంటి కారణాలతో వాళ్లకు భయం, బాధ్యత పోయాయి. వాస్తవానికి మోళీ తతంగానికి సబ్-రిజిస్ట్రారు కార్యాలయమే కేంద్ర బిందువుగా ఉంటుంది. చట్టాలు ఉన్నా ఇప్పటి వరకూ యథేచ్ఛగా భూ అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి.

ఫ్రీ హోల్డు పేరుతో..

22(ఎ) జాబితాలో ఉన్న భూములను కబ్జాదారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటూనే ఉన్నారు. వాస్తవానికి నిషేధిత భూముల జాబితా ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో గ్రామాలు, సర్వేల వారీగా ఉంటుంది. కానీ దానిపై పెద్దగా అవగాహన లేక ప్రభుత్వ ప్రైవేటు భూములను ఆక్రమణదారులు చేజిక్కించుకుంటున్నారు. 2023లో వైసీపీ ప్రభుత్వం అడిన ఫ్రీహోల్డు నాటకం భూ పందేరానికి పరాకాష్టగా చెప్పవచ్చు. నిషేధిత జాబితాలో ఉన్న కొన్ని భూములను, చుక్కల భూములను అప్పట్లో జాబితా నుంచి తొలగించారు. దీనినే ఫ్రీహోల్డు అంటారు. దీంతో వీటికి రిజిస్ట్రేషను చేయించుకొనే వెసులుబాటు కలిగింది. అంతే.. వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. ఉమ్మడి తూర్పు గోదావరిలో వందలాది ఎకరాలు చుట్టబెట్టేశారు. ఎంతలా అంటే అటు రెవెన్యూ, ఇటు రిజిస్ట్రేషన్ల అధికారుల లెక్కలకు పొంతన కుదరనంతగా నొక్కేశారు. ఉదాహరణకు తూర్పు గోదావరి జిల్లాలో 5120 ఎకరాలను ఫ్రీహోల్డు చేశారు. వీటిలో 47 లావాదేవీల ద్వారా 41.866 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని జిల్లా రిజిస్ట్రారు కార్యాలయ రికార్డులు చెబుతుంటే.. 100 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన చట్టంతో ఫ్రీహోల్డును సెట్‌చేసే పనిని కూడా ప్రభుత్వం మొదలు పెట్టనుంది.

కొత్త చట్టం ఏం చెబుతుందంటే..

కొత్తగా వచ్చిన చట్టంతో ప్రతి జిల్లాలో ఒక కమిటీ ఏర్పడుతుంది. జిల్లా కలెక్టరు ఛైర్మన్‌గా ఉంటే, రిజిస్ట్రేషన్ల శాఖ, రెవెన్యూ తదితర శా ఖల నుంచి ఇతర సభ్యులు ఉంటారు. అక్ర మంగా రిజిస్ట్రేషను జరిగిందని కలెక్టర్‌కి ఫిర్యాదు అందిన తర్వాత కమిటీ రంగంలోకి దిగుతుంది. రిజిస్ట్రేషను అక్రమమని తేలితే రద్దు చేస్తారు. ఇప్పటి వరకూ ఈ అధికారం క్రయ విక్రయదారులిద్దరూ కలిపి లేదా సివిల్ కోర్టుల చేతుల్లోనే ఉండేది. కొత్తగా వచ్చిన చట్టంతో ఖర్చు, సమయం కూడా ఆదా అవు తుందని చెబుతున్నారు. విధి విధానాలు తమకు ఇంకా రాలేదని తూర్పు గోదావరి జిల్లా రిజిస్ట్రారు సత్యనారాయణ తెలిపారు.




మన కోటావోడు.. ఇక లేడా!

నటుడు జితమోహన మిత్రతో కోట (ఫైల్)

గోదారోళ్లతో ఎంతో అనుబంధం

» తొలి సినిమా ప్రాణం ఖరీదు
» కోనసీమలోనే చిత్రీకరణ
» కన్నీళ్లు పెట్టుకున్న అభిమానులు

నాకేంటి.. నాకేంటి!.. అంటూ అహ నా పెళ్లంటలో పిసినారి క్యారెక్టర్‌లో కడుపుబ్బా నవ్వించినా.. వీడెవండి బాబూ అంటూ పవిత్ర బంధం సినిమాలో వెంకటేష్ తండ్రిగా ఆకట్టుకున్నా.. శత్రువు..గణేష్ సినిమాల్లో విలన్ పాత్రల్లో రాణించినా.. గోదారోళ్ల యాస భాషలే ఆయన నటనకు కంచుకోట.. పాత్ర ఏదైనా గోదారోళ్ల డైలాగ్‌లతో ఆకట్టుకునేవారు.. అందుకే ఒకానొక టైమ్‌లో మన కోటావోడు.. ఉన్నాడంట్రా సినిమా కెళదాం అనేస్థాయికి అభిమానుల గుండెల్లో కోట కట్టుకున్నారు.. అయితే ఆదివారం ఆయన మృతిచెందడంతో.. ఇక లేరనే చేదునిజాన్ని తట్టుకోలేక అభిమానులు కన్నీటిపర్యంతమయ్యారు.

అమలాపురం రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): క్రూరమైన విలనిజమైనా, కడుపుబ్బ నవ్విం చే హాస్యరసమైనా, కన్నీళ్లు పెట్టించే సెంటిమెంటు సీనైనా.. ఏదైనా అవలీలగా చేసేసి.. సీన్‌ను పండించగల అతి అరుదైన ఆర్టిస్టు కోట శ్రీనివాసరావు.. గోదావరి జిల్లా వాళ్లకు మాత్రం ఎప్పటికీ కోటావోడు..హాస్యాన్ని కొత్త పుంతలు తొక్కించడంతో పాటు తన సహజశైలి నటనతో, వాక్ చాతుర్యంతో చలనచిత్రసీమలో ప్రత్యేక స్థానం సాధించారు. సహజ నటుడిగా పేరొందిన కోట శ్రీనివాసరావుకు కోనసీమతో ఎంతో అనుబంధం ఉంది. 1978లో విడుదలైన ప్రాణం ఖరీదు చిత్రంలో తొలిసారిగా కోట శ్రీనివాసరావు నటించారు.ఆ చిత్రం షూటింగ్ సఖినేటిపల్లి మండలం గుడిమూల పరిసర ప్రాంతాల్లోనే జరిగింది. సినిమాల్లో నటిస్తూనే బ్యాంకు ఉద్యోగిగా కొనసాగారు. 1987లో కోటశ్రీనివాసరావు సమనసలోని స్టేట్ బ్యాంకులో పని చేశారు. నాటి గ్రామ సర్పంచ్ మామిళ్లపల్లి రాజారావు నడుపుతున్న అన్నపూర్ణ టాకీస్‌ను సందర్శించారు. టాకీస్ వద్ద శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. చిత్రమేమిటంటే ఆ సమయంలో అన్నపూర్ణ టాకీస్‌లో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి నటించిన ప్రతిఘటన చిత్రం ఆడుతోంది. ఆ సినిమాలో కోట శ్రీనివాసరావు నటించారు. కోట శ్రీనివాసరావు మృతిచెందారన్న సమాచారం ఎంతో కలచివేసిందని నాటి సర్పంచ్ మామిళ్లపల్లి రాజారావు అన్నారు.



అనపర్తిలో 'కోట' ఎన్నికల ప్రచారం

అనపర్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోట శ్రీనివాసరావు మరణం తీరని లోటని బీజేపీ నాయకుడు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి అన్నారు. కోటతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.1998లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి తరపున ప్రచారం చేసేందుకు అనపర్తి వచ్చిన ఆయనతో ముచ్చటించే అవకాశం కలిగిందన్నారు. అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన బి.రత్నారెడ్డి..1966లో ఏలూరులోని సీఆర్‌రెడ్డి కళాశాలలో కోట శ్రీనివాసరావుతో కలిసి డిగ్రీ (బీఎస్సీ) పూర్తి చేశారు.

ఎన్నో మరుపురాని పాత్రలు

తర్వాత జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన అహ నా పెళ్లంటలో కోట శ్రీనివాసరావు లక్ష్మీపతి అనే విలక్షణమైన పాత్రల్లో నటించారు. పిసినారి తండ్రిగా ఆయన చేసిన పాత్ర ఎంతో మెప్పించింది. గోదావరి జిల్లాలోనే ఈ చిత్ర ం షూటింగ్ జరగ్గా ఈ పాత్రలో కోడిని కట్టేసి సగం పగిలిన కళ్ల అద్దాలతో ఉత్తి అన్నం తింటూ చికెన్ తిన్నట్టుగా ఫీలయ్యే సీన్‌ను ఇప్పటికీ మీమ్స్‌లో వైరల్ చేస్తుంటారు. కోటా నటించిన మరో మరుపురాని చిత్రం వంశీ దర్శకత్వంలో వచ్చిన శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్.. ఇందులో ఏళ్ల పాపారావుగా ఆయన పండించిన హాస్యం అద్భుతం.. రాజమహేంద్రవం, కోనసీమల్లో ఈ చిత్ర షూటింగ్ జరగ్గా.. గోదావరి యాసలో కోటా పలికిన డైలాగులు మరో స్థాయిలో ఉంటాయి. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన చూపులు కలిసిన శుభవేళ చిత్రంలో గుర్నాథం పాత్ర కోటకు మరో ఆణిముత్యం లాంటిది.తెలుగు భాషను ప్రేమించే జమిందారుగా..ఆయన గ్రాంధిక బాషలో మాట్లాడుతూ పండించిన హాస్యం భలే ఉంటుంది. 'ఉత్తరపురుషుడు', 'నిశివర్ణోష్ణోదకము' 'ఉష్ణగ్రాహకఘటం', 'అశ్వము అధిరోహించుట', 'చతుష్చక్ర శకట నివాస స్థానము' అనే పదాలు.. ఆయన నోటి వెంట ఆరోగ్యకరమైన హాస్యాన్ని పండించాయి. తర్వాత కోనసీమ పరిసరాల్లో తీసిన ఖైదీనెంబరు 786లో ఆయన సూర్యచంద్రరావు పాత్రలో మెప్పించారు. యమలీలలో ఇన్‌స్పెక్టర్ రంజిత్, హలోబ్రదర్‌లో తాడిమట్ట య్యవినోదంలో బంగారం సహా ఇంకా అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. 1992లో విడుదలైన భలే ఖైదీలు చిత్రం కాకినాడ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంది. కీలక సన్నివేశాల చిత్రీకరణలో కాకినాడలోని ప్రైవేటు బస్సులో షూటింగ్ నిర్వహించారు. ఈ చిత్రంలో అమలాపురం రూరల్ మండలం నవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీరామప్రసాద్ ఆర్టీసీ కండక్టర్‌గా నటించారు. కోట శ్రీనివాసరావు మృతిచెందారన్న వార్త తనను ఎంతగానో కలచివేసిందని శ్రీరామప్రసాద్ నాటి షూటింగ్ సంఘటనలను గుర్తు చేసుకున్నారు.ఇక అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్న ప్రముఖ రచయిత దువ్వూరి సుబ్రహ్మణ్యశర్మ పలు పర్యాయాలు కోట శ్రీనివాసరావును కలిశారు.ఆయనతో అనుబంధాన్ని సుబ్రహ్మణ్యశర్మ వివరించారు. కోట శ్రీనివాసరావు మృతికి ఎంపీ పురం దేశ్వరి సంతాపం తెలిపారు.

కోటాభిమానులు..

దేవీపట్నం/రాజమహేంద్రవరం కల్చరల్/నిడదవోలు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ముద్దుల ప్రియుడు చిత్రం దేవీపట్నం ఉమాచోడేశ్వర స్వామి ఆలయంలో షూటింగ్ చేశారు. ఈ సినిమాలో కోట శ్రీనివాసరావు కొబ్బరికాయల సుబ్బయ్య పాత్రలో నటించారు. సినీనటుడు కోట శ్రీనివాసరావుతో తమకు గల అనుబంధాన్ని రాజమహేంద్రవరానికి చెందిన నటుడు, గాయకుడు జిత్‌మోహన్ మిత్ర పంచుకున్నారు. సుమారు 50 సినిమాల్లో ఆయనతో కలిసి నటించినట్టు చెప్పారు. కోట శ్రీనివాసరావుతో తాను తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల గ్రామం, రాజమహేంద్రవరం సిటీ పరిధిలోని మోరంపూడిలో జరిగిన సినిమా షూటింగుల్లో పాల్గొన్నట్టు తెలిపారు. నిడదవోలు పరిసర ప్రాంతాల్లో 1996 సంవత్సరం తాళి సినిమా చిత్రీకరణ సమయంలో సినీనటుడు కోట శ్రీనివాసరావు నిడదవోలు పట్టణంలోని సుంకవల్లి గణేశ్వరరావు నివాసంలో విడిది చేశారు. ఆ సమయంలో గణేశ్వరరావు కుమారుడు సుంకవల్లి శ్రీధర్ వారితో ఫొటో దిగారు. ఆయన మృతితో గోదావరి జిల్లాల్లో అభిమానులు జ్ఞాపకాల నెమరు వేసుకుని కన్నీటిపర్యంతమవుతున్నారు.



కాళి పాదాన పుట్టావంటే.. గోదారమ్మ

7

గోదావరి ఉధృతంగా ఉంది.. ఎగువ ప్రాంతాల్లో తగ్గుముఖం పట్టడంతో వరదంతా ఉరుకున పరుగున వచ్చిపడుతోంది.. గట్లను తాకుతూ.. లంకలను ముంచుతూ పరుగులు పెడుతోంది. 6.56 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. గోదావరి ఉధృతికి కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ఈ చిత్రమే ఉదాహరణ.. మొదటి ఫొటోలో శివలింగం గోదావరిలో నానుతూ కనిపించింది.. పది నిమిషాల వ్యవధిలోనే శివయ్యను గోదారమ్మ ముంచెత్తిన దృశ్యం రెండో చిత్రంలో చూడవచ్చు.. ఆదివారం గోదావరి ఉధృతి ఇంతలా ఉంది.. ఈ ఏడాది ఇంత ఉధృతంగా రావడం ఇదే తొలిసారి.. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. అయితే సాయంత్రానికి గోదావరి తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు..

పెరుగుతున్న వరద

» కనకాయలంక కాజ్‌వే మునక
» ముక్తేశ్వరం రేవులో రాకపోకలకు ఇబ్బందులు
» లంక గ్రామాలకు చేరుతున్న వరద నీరు
» ఆందోళనలో రైతులు



పి.గన్నవరం మండలం చాకలిపాలెంవద్ద కనకాయలంక కాజ్‌వేపై వరద నీటిలో వాహనదారుల ఇబ్బందులు

అమలాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో గోదావరి వరద ఉధృతి పెరుగుతుంది. భద్రాచలం వద్ద గోదావరి వరద నిలకడగా కొనసాగుతున్నప్పటికీ కోనసీమ జిల్లాలో మాత్రం నదీపాయల్లో వరద ప్రవాహం ఆదివారం పెరిగింది. దీంతో పలుచోట్ల కాజ్‌వేలు ముంపునకు గురై రవాణా సౌకర్యాలకు బ్రేక్ పడింది. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద గోదావరి చేరినట్టు అధికారులు భావిస్తున్నారు. బ్యారేజీవద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. 6.72లక్షల క్యూసెక్కుల నీటిని బ్యారేజీ ద్వారా సముద్రంలోకి వదిలేశారు. దీంతో జిల్లాపరిధిలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధ గౌతమీ నదీపాయల్లో నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలను కలుపుతూ చాకలిపాలెంవద్ద ఉన్న కనకాయలంక కాజ్‌వే పైకి భారీగా వరదనీరు చేరడంతో గ్రామాలకు రవాణా సౌకర్యాలు స్తంభించిపోయాయి. రెండురోజులక్రితం పి.గన్నవరం మండలం జి.పెదపూడివద్ద వైనతేయ నదికి వేసిన గట్టు వరద ఉధృతికి తెగిపోవడంతో అక్కడ పడవలపైనే లంక గ్రామాల ప్రజలను దాటిస్తున్నారు. కోటిపల్లి-ముక్తేశ్వరం రేవులో ప్రయాణికుల రాకపోకలకు వరద ఉధృతి బ్రేక్ వేసింది. ముక్తేశ్వరం వైపు నదీపాయకు, లంకకు మధ్య రేవు కాంట్రాక్టర్లు వేసిన తాత్కాలిక రహదారి కొట్టుకుపోవడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. మామిడికుదురు మండలంలో అప్పనపల్లి పరిసర లంక గ్రామాలకు వరద నీరు చేరుతోంది. రావులపాలెం సమీపంలోని వరద పెరగడంవల్ల లంకల్లో వేసిన పంట పొలాల్లోకి వరద నీరు చేరుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పలుచోట్ల కాజ్‌వేల పైకి నీటి ఉధృతి పెరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరద ప్రవాహం భద్రాచలం వద్ద నిలకడగా ఉన్నా కోనసీమ జిల్లాలో మాత్రం పెరుగుతోంది. రానున్న 24 గంటల్లో మరో రెండు అల్పపీడనాలను వాతావరణశాఖ ప్రకటించడంతో మళ్లీ వర్షాలుకురిస్తే వరద పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మామిడికుదురు మండలం పెదపట్నం మధ్యలంకలో నీట మునిగిన కూరగాయల పంటలు



యానాంలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్‌ఏ మునిస్వామి

నానుతున్న కూరగాయల పంటలు

మామిడికుదురు, జూలై 13(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి పెరగడంతో పల్లపు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. పెదపట్నంలోని మధ్యలంకలోగల కూరగాయల పంటలైన వంగ, బెండ, దొండ పాదలు వరద నీట నానుతున్నాయి. అప్పనపల్లి స్నానాలరేవువద్ద వరద పెరగడంతో భక్తులు వరద నీటిలోనే స్నానమాచరించి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ప్రధానంగా అప్పనపల్లి, పెదపట్నం, పాశర్లపూడి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామంలోని పల్లపు ప్రాంతాలు వరద నీట మునుగుతున్నాయి. సోమవారం నాటికి వరద తీవ్ర తగ్గుతుందని లంక గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కనకాయలంక కాజ్‌వేను తాకిన వరద ప్రవాహం



గంటిపెదపూడి బూరుగులంక నదిపాయ వద్ద పడవపై రాకపోకలు సాగిస్తున్న లంకగ్రామస్తులు

పి.గన్నవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం చాకలిపాలెంవద్ద కాజ్‌వేపై వరద నీరు చేరడంతో లంకగ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. లంకల్లో ఉన్న కొబ్బరి కాయలను రైతులు వివిధ వాహనాలపై ఇవతలి ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. కాజ్‌వేవద్ద ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లా అధికారయంత్రాంగం రెవెన్యూ, పోలీసుఅధికారులను ఏర్పాటుచెయ్యడంతోపాటు ఇంజన్‌పడవలను అందుబాటులో ఉంచారు. దొడ్డిపట్ల రేవును సైతం తాత్కాలికంగా మూసివేశారు. వరదనీటిలో రాకపోకలు సాగించడానికి లంక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనకాయలంక కాజ్‌వే వద్ద కాజ్‌వేపై రాకపోకలు సాగించవద్దని పోలీసు, రెవెన్యూసిబ్బంది ఏర్పాటుచేసిన మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. నరసాపురం ఆర్డీవో దాసిరాజు, యలమంచిలి తహశీల్దార్ గ్రంధివెంకట పవన్ కుమార్ కాజ్‌వేను పరిశీలించి వీఆర్వో ఘనలక్ష్మీతోపాటు రెవెన్యూ, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో పర్యటించి గోదావరి తగ్గుముఖం పట్టిందని మరికొన్నిగంటల్లో కాజ్‌వే యథాస్థితికి చేరు కుంటుందని లంకగ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. గంటి పెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు గ్రామాలతోపాటు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలు లంకగ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. బెల్లంపూడిలో సర్పంచ్ బండిమహాలక్ష్మి వినతితో రెవెన్యూఅధికారులు రైతులకోసం బోటునుఏర్పాటుచేశారు.

రెడ్‌బుక్ రాజ్యాంగానికి భయపడే ప్రసక్తే లేదు

» 'బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ' సమావేశంలో వైసీపీ జిల్లాశాఖ అధ్యక్షుడు జగ్గిరెడ్డి



అమలాపురంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, మాజీమంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, దానికి వైసీపీ శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని వైసీపీ జిల్లాశాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. హామీలను గుర్తుచేస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించాలని సూచించారు. అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో ఆదివారం బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. మాజీమంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ అమలాపురం తాలూకా సీఐ ప్రశాంత్‌కుమార్ వ్యవహారశైలిపై తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. చేతిలో పవర్ ఉందని, లాఠీ ఉందని ఇష్టానుసారం రెచ్చిపోతే చూస్తూ ఊరుకోమన్నారు. అమలాపురం పార్లమెంటు సమన్వయకర్త జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై మండల, గ్రామస్థాయిల్లో కూడా మోసం గ్యారంటీ సభలు నిర్వహించాలన్నారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించాలన్నారు. మోసం గ్యారంటీపై రూపొందించిన వైసీపీ బ్రోచర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు డాక్టర్ పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు, కర్రి పాపారాయుడు, నాయకులు చీకట్ల కిశోర్, చెల్లుబోయిన శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్‌ఖాదర్, కుడుపూడి సత్యశైలజ, పొగాకు శ్రీను, సంసాని బులినాని, రెడ్డి సత్యనాగేంద్రమణి పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలను అర్జీలుగా స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాల్లో, నాలుగు మున్సిపల్ కార్యాలయాల్లో, 22 మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్జీదారులు తమఅర్జీలను పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేయవచ్చునన్నారు. నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతులను 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు. నిర్దేశిత స్థాయిల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలను ఆశ్రయించి తమ సమస్యలకు తగు పరిష్కార మార్గాలు పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

భీమేశ్వరాలయంలో శాకంబరి ఉత్సవం 7

ధాన్యలక్ష్మి ఆలయంలో చోరీ
» అమ్మవారి మెడలో నోట్ల దండ, 2 కాసుల బంగారం, రూ.10వేలు అపహరణ



గోదావరి ప్రవాహం



ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

పెరుగుతూ.. తగ్గుతూ...



కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి ప్రవాహం

అత్యధికంగా 6,56,341 క్యూసెక్కులు సముద్రంలోకి...

ధవళేశ్వరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద పెరుగుతూ ప్రవహించిన గోదావరి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగి ఆపై తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయానికి అత్యధికంగా 6,56,341క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా దిగువకు ప్రవహించింది. ఈ సమయంలో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగిన ప్రవాహం ఆపై తగ్గుముఖం పట్టి సాయంత్రానికి 40 వేల క్యూసెక్కులకు పైగా తగ్గి 6,14,762 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద 24గంటల వ్యవధిలో 10 అడు గుల మేర తగ్గిన నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 30.60 అడుగులకు చేరుకుంది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 4,800క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6800 క్యూసెక్కులు చొప్పున నీరు విడుదల చేస్తున్నారు.





కూనవరం-వీఆర్‌పురం మండలాల మధ్య ఉన్న బ్రిడ్జి దగ్గర శబరి, గోదావరి ప్రవాహం

కూనవరంలో 3 అడుగులకు..

కూనవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలంలో శబరి, గోదావరి నదులు తగ్గుముఖం పట్టింది. ఈ ప్రాంతంలో వరద 35 అడుగులకు చేరుకుంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి వరద తగ్గుముఖం పట్టింది. కూనవరంలో ఆదివారం రాత్రి 7 గంటలకు 3 అడుగులకు వరద ప్రవాహం చేరుకుంది.



రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద నీటి ప్రవాహం

గోష్పాదక్షేత్రంలో శివలింగాలను ముంచెత్తిన వరద

కొవ్వూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో వర్షాలకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో అఖండ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. భద్రాచలం వద్ద 41.3అడుగులకు చేరుకుని తగ్గుముఖం పట్టడంతో దిగువన కొవ్వూరు పరిసర ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టం పెరుగుతుంది. దీంతో గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాల్లో ఏర్పాటు చేసిన శివలింగాలను వరద ముంచెత్తింది.

ఇంజనీరింగ్ సీట్ల లెక్క తేలింది..

- జేఎన్టీయూకే పరిధిలో సీట్లు ఖరారు
- 2025-26 విద్యాసంవత్సరానికి 106 కళాశాలలకు గుర్తింపు
- నూతనంగా రెండు ఇంజనీరింగ్ కళాశాలలు
- ఇంజనీరింగ్‌లో సుమారు 30వేల సీట్లకు అనుమతి
- 18 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు

జేఎన్టీయూకే, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు ఎప్పుడు జరుగుతాయని ఎదురుచూస్తున్న విద్యార్థులకు కళాశాలల్లో ప్రవేశాలకు లైన్ క్లియర్ కానుంది. ఏపీఈఏపీసెట్‌కు సంబంధించిన వెబ్ కౌన్సెలింగ్ ఈనెల 7న ప్రారంభమైంది 16 వరకూ ఆన్‌లైన రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, 17 వరకూ ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన కొనసాగనుంది. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈనెల 18 వరకూ కొనసాగనుంది. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల నుంచి ఇంజనీరింగ్ సీట్ల సంఖ్యపై ఉన్నత విద్యామండలికి నివేదిస్తేనే అక్కడ నుంచి కౌన్సెలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్ వస్తుంది. రాష్ట్రంలోని అత్యధిక కళాశాలలకు అనుసంధానంతో పాటూ సాంకేతిక వర్సిటీల్లో రాష్ట్రంలో కీలకంగా ఉన్న జేఎన్టీయూకే ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నివేదికను పంపించారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఇంజనీరింగ్ కళాశాలలు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్నాయి.

106 కళాశాలలకు గుర్తింపు

2025-26 విద్యాసంవత్సరానికి జేఎన్టీయూకే ఉన్నత విద్యామండలికి సీట్ల కేటాయింపు కోసం నివేదించింది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న 106 కళాశాలల్లో ఇంజనీరింగ్‌లో సుమారుగా 30వేల సీట్లు భర్తీ చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు. అయితే గతేడాది మాదిరిగానే ఈ విద్యాసంవత్సరం కూడా విద్యార్థులు సీఎస్ఈ, ఏఐ వైపు మొగ్గుచూపుతున్నారు.

ఆన్‌లైన్‌లో కళాశాలల తనిఖీ

ఏపీఎస్సీహెచ్ఈ ఆదేశాల మేరకు వర్సిటీ అనుబంధ కళాశాలల తనిఖీలు ఆన్‌లైన్‌లో చేపట్టారు. కళాశాలలోని వసతులు, స్థితిగతులు, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, విద్యార్థి- అధ్యాపకుల నిష్పత్తి, ఆట స్థలం, కళాశాల క్యాంపస్ పరిస్థితి, గ్రంథాలయ సదుపాయం, ల్యాబ్‌లు తదితర అంశాలను నిజనిర్ధారణ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) పర్యవేక్షణ చేస్తుంది. ఈ కమిటీ సిఫార్సు మేరకు ఏఏ కళాశాలలకు ఎన్ని సీట్లు కేటాయించాలి అనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. అంతేకాకుండా ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్న ఇంజనీరింగ్ కళాశాలలకు ఎన్నిసీట్లకు యూనివర్సిటీ అనబంధ గుర్తింపు ఇస్తుందనే అంశానికి ఎఫ్ఎఫ్‌సీ సిఫార్సులే కీలకం. అయితే ఈ కమిటీలో వర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు సభ్యులుగా ఉంటారు. ఏపీఈఏపీసెట్ వెబ్ ఆప్షన్లపై సందిగ్ధత వీడింది.

జేఎన్టీయూకే పరిధిలో 164 కళాశాలలుండగా వాటిలో 106 ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లను భర్తీ చేయనున్నారు. 4 కళాశాలలు డీమ్డ్ యూనివర్సిటీలుగా, 8 కళాశాలలు జీరో ప్రవేశాల కారణంగా, రెండు కళాశాలలు మెర్జ్ కాగా మరొక కళాశాలను మూసివేశారు. 34 ఫార్మసీ కళాశాలలు, 9 ఎంబీఏ, ఎంసీఏ మేనేజ్‌మెంట్ కళాశాలలున్నాయి. అయితే ఈ ఏడాది రెండు నూతన ఇంజనీరింగ్ కళాశాలలు అనుమతి పొందాయి.

ఉన్నత ప్రమాణాలున్న కళాశాలలకే గుర్తింపు



ఏపీ ఉన్నత విద్యామండలి రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాలల ప్రమాణాలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలన చేసి అనుమతి ఇవ్వాలని సూచించింది. వాటి ప్రకారం కాకినాడ జేఎన్టీయూ నుంచి ఆన్‌లైన్‌లో పరిశీలన నిర్వహించాం. సాంకేతిక విద్యలో ఉన్నతప్రమాణాలు పాటించిన అన్ని వసతులు ఉన్న కళాశాలలకే గుర్తింపు నిచ్చాం. ఆ విధమైన కళాశాలల్లో అభ్యసిస్తే విద్యార్థులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

జేఎన్టీయూకే ఉపకులపతి,
ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్

శాకంబరిగా తలుపులమ్మ



శాకంబరి దేవిగా తలుపులమ్మ



క్యూలో బారులుతీరిన భక్తులు

తుని రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాడమాస మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు ప్రత్యేక క్యూలలో బారులుతీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటా వార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో విశ్వనాధరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.17.3 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు.

లోవ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

రూ.17.3 లక్షలు ఆదాయం

ఆలయానికి విరాళం

లోవ దేవస్థానంలో ఆలయ పునఃనిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. పిట్లపాలెం గ్రామానికి చెందిన దాసరి నాగేశ్వరరావు, బుల్లమ్మ దంపతుల కుమారుడు సాయి నాయుడు రూ.లక్షా116 విరాళం అందజేశారు. అనంతరం వారికి ఆలయ పండితులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

1.10 లక్షల సత్యదేవుడి ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

రూ.22 లక్షల ఆదాయం

అన్నవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవ నుంచి తిరుగు ప్రయాణంలో స్వస్థలాలకు వెళ్లే భక్తులు అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి బారులు తీరారు. ఆదివారం కొండపైన, కొండదిగువన ఉన్న ప్రత్యేక కౌంటర్ల ద్వారా 1.10 లక్షల ప్యాకెట్లు విక్రయించగా రూ.22 లక్షల ఆదాయం లభించినట్టు అధికారులు తెలిపారు.

భీమేశ్వరాలయంలో శాకంబరి ఉత్సవం



శాకంబరిగా దర్శనమిస్తున్న మాణిక్యాంబ, శోభాయాత్రలో పాల్గొన్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో అష్టాదశశక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయంలో శాకంబరి ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట ఆస్థాన మండపం నుంచి దేవస్థానం ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, చీర, సారె మంగళవాయిద్యాలతో శోభాయాత్ర ప్రారంభించారు. ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చకులు, సిబ్బంది, సేవా భక్తులు, 150 కిలోల సారె సమర్పించిన కంచర్ల చక్రి, సారె సమర్పించిన ఇతర భక్తులు పాల్గొన్నారు. అన్నాయిపేట వద్ద మంత్రి సుభాష్ హాజయ్యారు. అనంతరం ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి మాణిక్యాంబకు చీర,సారె సమర్పించారు. కార్యక్రమంలో వాడ్రేవు సుందర రత్నాకరరావు, సత్యంవాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం భీమేశ్వరస్వామి దేవస్థానం తరఫున వెలంపాలెంలో గోగులమ్మవారికి సారె సమర్పించారు.


ధాన్యలక్ష్మి ఆలయంలో చోరీ

అమ్మవారి మెడలో నోట్ల దండ, 2 కాసుల బంగారం, రూ.10వేలు అపహరణ

కె.గంగవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం గంగవరం- కోటిపల్లి ప్రధాన రహదారిలో కోట పరిధిలో ఉన్న కోట ధాన్యలక్ష్మి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయం వెనుక భాగాన గోడకు కన్నం పెట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న 4 సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అమ్మవారి మెడలో రూ.4 వేలు విలువ చేసే నోట్లతో తయారు చేసిన దండ, రూ.10 వేలు, 2 కాసుల బంగారు ఆభరణాలు దొంగిలించుకుపోయారు. హుండీని బద్దలు కొట్టారు. ఐతే హుండీలో డబ్బులు ఇదివరకే తీసివేయడం వల్ల ఏమీ దొరక లేదు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకటనారాయణ చోరీ ప్రదేశాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ. ఎస్‌కె.జానీబాషా పేర్కొన్నారు.



ఆలయం గోడకు పెట్టిన కన్నం



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యుడు

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

రూ.6 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసులలో నేరాలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.6 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని సాంస్కృత పాఠశాల దగ్గరలోని కూల్‌డ్రింక్స్, కూరగాయాల షాపులో ఈనెల 8న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు బద్దలు కొట్టి రూ.3 వేల నగదు, 2.25 లీటర్ల థమ్సప్ బాటిల్ కేసులు 9, హోమ్ థియేటర్, సిగరెట్ ప్యాకెట్లను దొంగిలించుకుపోయినట్టు షాపు నిర్వాహకుడు తొండ్రంకి కురిమిశెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో 2 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడిన రాజమహేంద్రవరం నామవరం, మసీదు వద్ద ఎ.బ్లాక్‌కు చెందిన (ప్రసుత్తం కొవ్వూరు మండలం వేములూరులో నివాసం ఉంటున్న) గుడ్ల సతీష్ అలియాస్ పకోడి, తమ్మిశెట్టి సాయి, కొంతమూరుకు చెందిన బొండపల్లి అచ్యుత్ సతీష్‌ను ఈ నెల 12న కొవ్వూరు నందమూరు రోడ్‌లోని బుద్ధుడుబొమ్మ సెంటర్‌లో అరెస్టు చేశామన్నారు. వారి నుంచి సుమారు రూ.6 లక్షల విలువైన కొంత చోరీ సొత్తు, ఇతర కేసులకు సంబంధించి 5 మోటారు సైకిల్‌లు, ఆండ్రాయిడ్ ఫోన్, జత వెండి పట్టీలు, బంగారు నక్లెస్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. గుడ్ల సతీష్‌పై కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో గతంలో 5 కేసులున్నాయని డీఎస్పీ తెలిపారు. కేసును చేధించి నిందితులను అరెస్టు చేయడంలో ప్రావీణ్యం చూపిన సీఐ పి.విశ్వం, ఎస్ఐ పి.రవీంద్రబాబు, సిబ్బంది అబ్బాస్‌బేగ్, జి.అనీల్‌కుమార్, ఆర్.కోట సత్యనారాయణ, కె.జయరాం, ఎస్.గణేష్, ఎస్.కె. వల్లీను జిల్లా ఎస్పీ అభినందించారని చెప్పారు.

సీజ్ చేసిన బోటు దొంగతనం

కేసు నమోదు చేసిన కొవ్వూరు పోలీసులు

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన మెకనైజ్డ్ డ్రెజ్జింగ్ బోటు దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో గత నెల జూన్ 2న అఖండ గోదావరి కుడిగట్టు విభాగం ఏఈ జి.మణికంఠరాజు, రెవెన్యూ, జిల్లా టాస్క్‌ఫోర్సు బృందంతో కలిసి ఇసుక ర్యాంపులు తనిఖీ నిర్వమించారు. దండకుంట పుంత ఇసుకర్యాంపు-2లో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న 2 మెకనైజ్డ్ డ్రెజింగ్ బోట్లు వెరోనికా శ్రీలోహితాక్ష, పేరు తెలియని బోటును సీజ్ చేసి అధికారుల కస్టడీలో ఉంచారు. ఈనెల 11న వెరోనికా శ్రీలోహితాక్ష డ్రెజ్జింగ్ బోటు కనిపించకపోవడంతో పల్నాడు జిల్లా అమరావతి మండలం ధరణికోటకు చెందిన బుడ్డి రవికుమార్, కృష్ణాజిల్లా గొల్లపూడికి చెందిన పీత వెంకట రామారాజు బోటును దొంగతనం చేశారని ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

నాలుగేళ్ల కిందట యువతి అదృశ్యం

కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన కొత్తపల్లి పోలీసులు

కొత్తపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సుమారు నాలుగేళ్ల కిందట అదృశ్యమైన యువతి ఆచూకీని కొత్తపల్లి పోలీసులు కనుగొని ఆమె కుటుంబీకులకు అప్పగించారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండల పొన్నాడ గ్రామానికి చెందిన ఏడిద లోవలక్ష్మి 2021లో ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అప్పుడు కొత్తపల్లి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అదృశ్యమైన కేసుల్లో పూర్తిస్థాయి విచారణ చేపట్టిన నేపథ్యంలో లోవలక్ష్మి హైదరాబాద్‌లో ఉందన్న విషయం కొత్తపల్లి పోలీసులకు చేరింది. దీంతో ఎస్ఐ జి వెంకటేష్ హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పంటకాల్వలో మృతదేహం

తెలంగాణకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

మండపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మండపేట మండలం జెడ్. మేడపాడు వంతెన వద్ద పంట కాల్వలో గత 4 రోజుల నుంచి గుర్తుతెలియని మృతదేహం ఉండడంతో స్థానికులు గుర్తించారు. ద్వారపూడికి చెందిన వీఆర్వో బాపూజీ మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడి జేబులో లభ్యమైన పాన్‌కార్డు ఆధారంగా గొట్టు ముక్కలకూమార్‌రాజు (45)గా, అతడి ది తెలంగాణ రాష్ట్రం దమ్మయ్య గూడ కేసరి మండలం కె.వి.రంగారెడ్డి జిల్లాగా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించామని రూరల్ ఎస్ఐ వి.కిషోర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మామపై అల్లుడు కత్తితో దాడి

కరప, జూలై 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో ఆదివారం మధ్యాహ్నం వరుసకు మామ అయిన వ్యక్తిపై అల్లుడు కత్తితో దాడి చేసి గాయపర్చాడు. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప గ్రామానికి చెందిన భేరి చంద్రశేఖర్‌కు అతడి చిన్నాన్న భేరి రామకృష్ణకు మధ్య గత కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. రామకృష్ణ కుమారుడు వృత్తిరీత్యా కుటుంబంతో సహా తునిలో ఉంటున్నాడు. అతడి మావయ్య బిక్కవోలుకి చెందిన అమజాల వీరరాఘవ ఆదివారం మధ్యాహ్నం భోజనం క్యారేజ్ పట్టుకుని కరపలో ఉన్న వియ్యంకుడు రామకృష్ణ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఆస్తి విషయమై ఇరువర్గాల మధ్య మరోసారి రచ్చ జరిగింది. ఈ క్రమంలో చంద్రశేఖర్, అతడి తల్లి రాజరాజేశ్వరి, వియ్యంకుళ్లు రామకృష్ణ, వీరరాఘవలు పరస్పరం వాగ్వాదం చేసుకోవడంతో ఘర్షణ జరిగింది. ఆవేశం పట్టలేని చంద్రశేఖర్ కత్తితో వీరరాఘవపై దాడి చేసి ఎడమచేతిపై రెండు చోట్ల నరకడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు స్పందించి బాధితుడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ తోట సునీత హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కాకినాడ జీజీహెచ్‌లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు..

నలుగురు నిందితులకు పోక్సో కేసులో రిమాండ్

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కి తరలింపు

జీజీహెచ్ (కాకినాడ), జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన రోగ నిర్ధారణ ల్యాబ్‌లకు చెందిన ఉద్యోగులకు రెండు సెక్షన్‌లలో బెయిల్ వచ్చినా మైనర్ బాలికలపై వేధింపులకు గురిచేసిన పోక్సో కేసులో మాత్రం నాన్ బెయిలబుల్ సెక్షన్ కావడంతో బెయిల్ అనివార్యమయ్యింది. వివరాల్లోకి వెళితే కళ్యాణ్ చక్రవర్తి, బి.జిమ్మిరాజు, గోపాలకృష్ణ ప్రసాద్‌లు 55 మంది ఎంఎల్‌టీ విద్యార్థినులను వేధింపులకు గురిచేయగా వారు కొంతకాలం పాటు బిక్కుబిక్కుమని ఎవరికి చెప్పకుండా బాధను దిగమింగుకుని విధులకు హాజరైనా ఆ కీచకుల ఆగడాలు శృతిమించడంతో కళాశాల యాజమాన్యానికి భయంభయంగా మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో కళాశాల ప్రిన్సిపాల్ వేగంగా నిందితులపై పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. దాంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సెక్షన్ 354, సెక్షన్ 519 కింద, అలాగే టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో సెక్షన్ కింద కేసులు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. అయితే 2 సెక్షన్‌లో బెయిల్ మంజూరైనా పోక్సో కేసులో మాత్రం నలుగురికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కి తరలించారు. అయితే నిందితుడు జిమ్మిరాజును కేసు నుంచి తప్పించడం కోసం అతడి మేనమామ బూరిగ ఆశీర్వాదం చేసిన ప్రయత్నం పోక్సో కేసు అవ్వడంతో ఫలించలేదు.

రెండు మోటారుసైకిళ్లు ఢీ

ఇద్దరికి తీవ్రగాయాలు

కొవ్వూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గండిపోచమ్మ ఆలయ మలుపులో ఎదురెదురుగా 2 మోటారుసైకిళ్లు ఢీ కొన్నాయి. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం దివిలికి చెందిన వల్లభశెట్టి వెంకటేష్ పట్టిసీమ వెళ్లి బైక్‌పై తిరిగివస్తున్నాడు. అదే సమయంలో తాళ్లపూడి మండలం రాగోలపల్లికి చెందిన నీరుకొండ పోసిరత్నం కొవ్వూరు నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఇద్దరు కుమారదేవం గండిపోచమ్మ ఆలయం మలుపులో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొవ్వూరుప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

అమలాపురం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి వైశ్యసంఘ పచ్చిగోళ్ల జనార్ధనరావు, కొల్లూరి సత్యనారాయణమూర్తి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకొళపు శివరామసుబ్రహ్మణ్యం ఆదివారం ప్రారంభించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం, అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో వివిధ విభాగాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పల్లపోతు బంగారం, కొరుప్రోలు వెంకటేశ్వరరావు, నంబూరి రెడ్డియ్య ప్రారంభించారు. వెరికోస్ వెయిన్స్, గుండె, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, స్కిన్, డెంటల్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసన్ విభాగాల వైద్య నిపుణులు వందలాది మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్లడ్ టెస్ట్, బీపీ, ఈసీజీ, ఎకో వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు రోగులకు రూ.3లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు (బాబి), కార్యదర్శి కుసుమంచి పాపారావు, కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, సంఘ మెడికల్ కమిటీ చైర్మన్ పచ్చిపులుసు కృష్ణారావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సింగంశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు, పోశెట్టి సూరిబాబు, కాసు శ్రీనివాస్, పొలిటికల్ కమిటీ చైర్మన్ లక్కింశెట్టి బాబులు, వారణాశి గుప్తా, కాళ్లకూరి కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి, అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్,కోశాధికారి కె.వెంకటాచలప్రసాద్ పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న శివరామసుబ్రహ్మణ్యం

జాతీయస్థాయి యోగా పోటీలకు ఉషశ్రీ ఎంపిక

అమలాపురం టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న అడ్డగళ్ల ఉషశ్రీ జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఢిల్లీలో ఈ నెల 14,15,16 తేదీల్లో జాతీయస్థాయి యోగా పోటీలు జరుగుతాయని, ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి ఉషశ్రీ పాల్గొంటారని తెలిపారు.



ఉషశ్రీ యోగాసనం

ఎమ్మెల్యే దేవ పుట్టినరోజు వేడుకలు

అంతర్వేది, జూలై 13(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా టీడీపీ నాయకులు కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. పొన్నాల విజయ్, పొన్నాల ప్రభ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు జరిపారు. అధిక సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటు



కోట శ్రీనివాసరావుతో గుర్రం రామకృష్ణ

అల్లవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ సినీ నటులతో పాటు కోనసీమతో సినీ విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుకు ప్రత్యేక అనుబంధం ఉందని సినీ'మా' సభ్యులు, టీవీ ఆర్టిస్టు, సినీ ఆర్టిస్టు గుర్రం రామకృష్ణ అన్నారు. కోట శ్రీనివాసరావు మృతి సినిమా ఇండస్ట్రీకి తీరని లోటని ఆయన దిగ్భ్రాంతి చెందారు. 750 సినిమాల్లో నటించిన కోట శ్రీనివాసరావుతో మా అసోసియేషన్ సమావేశాల్లో తరచూ కలిసేవారమన్నారు. కోట శ్రీనివాసరావుతో పాటు తాను గుంటూరోడు సినిమాలో నటించానన్నారు. అందర్నీ నవ్విస్తూ హుషారుగా ఉండే కోట మృతి బాధాకరమన్నారు.

టీడీపీ కూటమి రామరాజ్య పాలన

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- పలుచోట్ల 'సుపరిపాలన' కార్యక్రమాలు

అల్లవరం, జూలై13(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమాలతో టీడీపీ కూటమి ఆంధ్రప్రదేశ్‌లో రామరాజ్య పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మొగళ్లమూరిలో టీడీపీ సుపరిపాలనలో తొలిఅడుగు ప్రచారం నిర్వహించారు. అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కడలి వెంకటేశ్వరరావు, వేగిరాజు వెంకట్రాజు, గుబ్బల రామ్‌ప్రసాద్, పచ్చిమాల ఏడుకొండలు, అల్లు సత్తిబాబు, అల్లూరి గోపాలకృష్ణంరాజు, వాసర్ల అప్పారావు, మంతెన సురేష్‌రాజు, కైల శోభన్‌బాబు, ఆకుల లక్ష్మణరావు, లూటుకుర్తి చిన్నా పాల్గొన్నారు.



అల్లవరం: మొగళ్లమూరిలో ఎమ్మెల్యే ఆనందరావు తొలిఅడుగు ప్రచారం

భట్టుచెరువులో తొలి అడుగు

కాట్రేనికోన, జూలై13 (ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు పంచాయతీ భట్టుచెరువలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. కూటమి సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. వెంట్రు సుధీర్, బడుగు పుల్లారావు, కాగిత శ్రీనివాస్, కాశి ఏసు, బూసి మధుబాబు, బళ్ళ సుధాకర్ పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ఎన్నో విజయాలు

అంతర్వేది, జూలై 13(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధి అనే రెండు అంశాల్లో ఎన్నో విజయాలు సాధించామని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు తెలిపారు. వీవీమెరక మధ్య గూపులో ఆదివారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీనివాస్, సతీష్‌బాబు ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సూపర్-6 హామీల్లో ప్రతీ హామీని నిలబెట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీకళావేదిక ఛైర్మన్ డాక్టర్ కత్తిమండప్రతాప్, టీడీపీ నాయకులు తాడి సత్యనారాయణ, చెల్లుబోయి. జయబాబు, నాగబాబు, సుంకర అమరజ్యోతికుమార్, సూర్యనారాయణ, హరహరరాజు, సుధాకర్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

ఉప్పలగుప్తం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూరిందని టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ అన్నారు. గొల్లవిల్లిలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసు, అడబాల సత్యనారాయణ, కడలి శ్రీనివాసరావు, పేరాబత్తుల చిన్నా పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం



ముమ్మిడివరం: గాజుల అలంకరణలో సత్తెమ్మతల్లి, అంబాజీపేట:శాకంబరిగా వాసవీమాత, మామిడికుదురు:శాకంబరిగా దొడ్డిగంగాలమ్మ

అయినవిల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): తొత్తరమూడి గ్రామదేవత శ్రీమురుగులమ్మ అమ్మవారిని ఆదివారం శాఖంబరిగా ప్రత్యేక అలంకారం చేశారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా ఆలయ అర్చకులు మండపల్లి తేజ ఆధ్వర్యంలో అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరిగా వాసవీ మాత

అంబాజీపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవార్ని అషాఢ మాసం సందర్భంగా ఆదివారం వివిధ రకాల కూరగాయలతో ఆలయ అర్చకులు శాకంబరిగా అలంకరించారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఆలయంలో లలితా పారాయణం చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవార్లను కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అమ్మవార్లకు చీర, సారె

రాజోలు, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాజోలులో సంత మార్కెట్ వద్దనున్న శ్రీవనువులమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లకు రాజోలు ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కాసు భవానీ ఆధ్వర్యంలో రాజోలు శ్రీఆంజనేయస్వామివారి దేవాలయం నుంచి ఊరేగింపుగా చీర, సారె, పూలు, పండ్లు ఆదివారం తీసుకువెళ్లి సమర్పించారు. ఈసందర్భంగా భవానీ మాట్లాడుతూ బూత ప్రేత పిశాచాలు, అంటు వ్యాధులు సోకకుండా రాజోలు గ్రామ దేవతలైన శ్రీవనువులమ్మ, కనకదుర్గమ్మవార్లకు చీర, సారె అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం రాజోలు సెక్రటరీ కొత్త నాగవెంకటపద్మావతి, కాసు రాణి, గెల్లి అన్నపూర్ణ, కాసు సుధా, ఆర్యవైశ్య మహిళలు, విశ్వహిందూ పరిషత్ కోనసీమ జిల్లా సహాయ కార్యదర్శి రాజా నాగరత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢం సారె

కాట్రేనికోన, జూలై 13(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మావుళ్ళమ్మకు ఆదివారం మహిళలంతా కలిసి పుట్టింటి సారె సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి పానకాలు, వివిధ రకాల స్వీట్లు ఆలయానికి తీసుకొచ్చి మహిళలంతా సామూహికంగా మావుళ్ళమ్మకు సారె సమర్పించారు. ఆలయ అర్చకుడు ఫణికాంత్‌శాస్త్రి ఆధ్వర్యంలో సహస్రనామ కుంకుమార్చన జరిగింది. కార్యక్రమంలో చెరుకు రామకృష్ణ, ఆలయ అర్చకుడు ఆణివిళ్ళ సాయిబాబా, రామకృష్ణపరమహంస, గ్రంధి రాంప్రసాద్, పవన్‌కుమార్, బాలవాసు, ఆకొండి శేషు, శంకరశాస్త్రి, కిరణ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. కాగా చింతలమెరకలో శ్రీవిజయలక్ష్మీదుర్గాదేవి అమ్మవారికి ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. ముందుగా గ్రామంలోని పానాటం వద్ద పూజలు చేశారు. అక్కడి నుంచి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. పూజారి ఆకొండి శ్రీకాంత్ పూజలు నిర్వహించారు.

శాకంబరిగా అశ్వరూడాంబిక

అంతర్వేది, జూలై 13(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి అనుబంధ ఆలయం స్వామివారి సోదరి అశ్వరూడాంబిక (గుర్రాలక్కమ్మ) అమ్మవారు ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం శాఖంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆచార సంప్రదాయాలతో అర్చకులు, ఆలయ అధికారులు అశ్వరుడాంబిక అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారిని కూరగాయలతో అలంకరించి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వివిధ సేవల ద్వారా రూ.87,585, అన్నదాన ట్రస్టు విరాళం ద్వారా రూ.1,38,290 మొత్తం రూ.2,25,871 ఆదాయం వచ్చిందని ఆలయ సమాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు.

మరిడమ్మకు ఆషాఢం సారె

ఉప్పలగుప్తం, జూలై 13(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి గ్రామదేవత మరిడమ్మతల్లికి ఆదివారం సంప్రదాయ ప్రకారం మహిళలు సారె సమర్పించారు. పుట్టింటి నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, స్వీట్లు గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం గ్రామ మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

శాకంబరిగా దొడ్డిగంగాలమ్మ

మామిడికుదురు, జూలై 13(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామదేవత దొడ్డి గంగాలమ్మవారు ఆదివారం శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం ఆదివారం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేకంగా అలంకరించిన శాఖంబరి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో ఆలయం వద్ద భక్తుల కోలాహలం నెలకొంది.

చందన స్వరూపంలో వెంకన్న



అంబాజీపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీభూదేవి శ్రీదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని చందన స్వరూపుడిగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారికి శ్రవణనక్షత్రం సందర్భంగా స్వామి,అమ్మవార్లకు వేకువజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో రూ.50లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన కాశివానితూము-చింతల మెరక, రాజుపాలెం-మట్టాడిపాలెం సిమెంటు రోడ్లను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రోడ్ల ఆధునికీకరణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో అధ్వానంగా ఉన్న రోడ్లను ఆధునికీకరించి ప్రజలకు మెరుగైన రోడ్లు, రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో సంపదను సృష్టించేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అనంతరం కాశివానితూము, చింతల మెరక, రాజుపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గత్తుల సాయి, చెల్లి అశోక్, తాడినరసింహారవు, గొలకోటి దొరబాబు, దొమ్మేటి రమణకుమార్, దాట్ల పృధ్విరాజు, సాగి సూరిబాబురాజు, దాట్ల బాబు, కడలి నాగు, ములపర్తి బాలకృష్ణ, కట్టా సత్తిబాబు, దివి మహాలక్ష్మి, పిల్లి నాగరాజు, మెండి కమల, అల్లూరి సత్యనారాయణరాజు, గుద్దటి జమ్మి, గోదశి పుండరీష్, విళ్ల వీరాస్వామినాయుడు, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, తాడి జానకీరామ్, జగతా గోవిందు, నడింపల్లి కుమార్‌రాజు, కాశి రామచంద్రరావు, నడింపల్లి శ్రీనివాస్‌రాజు, కాశి లాజర్, జనిపల్లి సత్యనారాయణ, పెన్మెత్స సురేష్‌వర్మ, మట్టపర్తి సత్యనారాయణ,

'కేంద్రీయ విద్యాలయానికి బాలయోగి పేరు పెట్టాలి'

అమలాపురం టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఓడలరేవులో త్వరలో నిర్మించనున్న కేంద్రీయ విద్యాలయానికి దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి పేరు పెట్టాలని మాజీ ఎమ్మెల్యేలు ఆదివారం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను కలిసి వివరించారు. ఓడలరేవులో కేంద్రీయ విద్యాలయానికి భూసేకరణ నిమిత్తం రూ.3.50కోట్లు మంజూరు చేయించిన ఎంపీ హరీష్ మాధుర్‌ను మాజీ ఎమ్మెల్యేలు చిల్లా జగదీశ్వరి, చెల్లి వివేకానంద, మానేపల్లి అయ్యాజీవేమా అభినందించారు. కోనసీమలో కేంద్రీయ విద్యాలయానికి నాటి ప్రధాని వాజ్‌పేయి సైతం హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే కేంద్రీయ విద్యాలయం పనులు ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం

మామిడికుదురు, జూలై 13(ఆంధ్రజ్యోతి): తమతో చదువుకున్న స్నేహితుడు నగరం గ్రామానికి చెందిన తాడి అశోక్‌కుమార్ కొబ్బరి చెట్టుపై నుంచి పడి మరణించడంతో ఆ కుటుంబానికి అశోక్‌తో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.40వేలు సాయం అందించారు. 2001-02లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఈ సహాయాన్ని అశోక్ భార్య నాగమణి, కుమార్తెకు అందించారు. విశ్రాంత ఎంఈవో నీతిపూడి చంద్రరావు, పూర్వ విద్యార్థులు జాలెం క్రాంతి వర్ధన్, డి.సూర్యప్రకాష్, చింతా సుధీర్, తాడి రామకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దేవ పుట్టినరోజు వేడుకలు



మలికిపురం: గజమాలతో ఎమ్మెల్యే దేవను సత్కరిస్తున్న నాయకులు



రాజోలులో వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా విశ్వేశ్వరాయపురంలోని ఆయన ఇంటి వద్ద, ఆరుబయట ఏర్పాటుచేసిన పుట్టినరోజు వేదిక పైనుంచి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల సహకారంతో రాజోలును మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. దేవ వరప్రసాద్‌ను కూటమి నాయకులు ఊరేగింపుగా వేదిక వద్దకు అట్టహాసంగా తీసుకువచ్చారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ స్థాయిలో అభిమానులు కూటమి నాయకులు, అధికార గణం ఎమ్మెల్యేను దుశ్శాలువాలు, పుష్పగుచ్చాలతో ముంచెత్తారు. ముందుగా వేదపండితులు, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందించారు. ఒకరికొకరు పోటీగా ఎమ్మెల్యేతో కేక్‌ను కట్ చేయించారు. సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, మంగెన భూదేవిలతో పాటు ఎన్డీఏ నాయకులు గజమాలతో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన తరపున దిరిశాల బాలాజీ నేతృత్వంలో గుబ్బల ఫణి, మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, గంటానాయుడు తదితరులు గజమాలతో సన్మానించారు. సామాజిక సేవకులు, పారిశ్రామిక వేత్త దెందుకూరి రాంబాబురాజు ఎమ్మెల్యేను గజమాలతో అభినందించారు. రాజమహేంద్రవరం పల్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత గుండె చికిత్స శిబిరాన్ని ఎమ్మెల్యే దేవ ప్రారంభించారు. 200మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, ఈలి శ్రీనివాస్, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, అడబాల సాయిబాబు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, అడబాల యుగంధర్, జంపన సత్యనారాయణరాజు, డాక్టర్ రమేష్‌బాబు, రావూరి నాగు, ముప్పర్తి సత్తిరాజు, గుబ్బల ఫణి, ఎం.సత్తిబాబు, అంజి, అడబాల విజయ్, భూపతిరాజు సాయిబాబురాజు, మంగెన భూదేవి, బందెల పద్మ, గంటా నాయుడు, హెలీన, రమాదేవి, రాజోలు సీఐ నరేష్‌కుమార్, మలికిపురం ఎస్ఐ సురేష్, దేశినీడి తాతాజీ, ఎలక్ట్రికల్ ఏడీఈ, ఏఈ ప్రసాద్ తదితరులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

రాజోలు,(ఆంధ్రజ్యోతి): రాజోలులో శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద ఎన్డీఏ నాయకులు సమక్షంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పేదలకు వస్త్రాలు, స్వీటు బాక్సులు పంపిణీ చేశారు. తొలుత అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను ఆయన కట్‌చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, రాజోలు గ్రామశాఖ టీడీపీ అధ్యక్షుడు పామర్తి రమణ, కుంపట్ల చిన్నారి, దిరిశాల బాలాజీ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యానాంలో షటిల్ టోర్నమెంట్



అవార్డులు అందుకుంటున్న ఫ్లాస్‌ఐఓసీ యజమాని మల్లాడి రఘువంశీ

యానాం, జూలై 13(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రీజియన్ పరిధిలోని ఇండియన్ ఆయిల్ కంపెనీకి సంబంధించిన కాకినాడ, అమలాపురం ఆర్ఎస్ఏ పరిధిలోని పలువురు ఐఓసీ డీలర్స్‌కు షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. యానాం జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలోని వైఎస్ఆర్ స్టేడియంలో జరిగిన టోర్నమెంట్‌లో 13జట్లు పాల్గొన్నాయి. విజేతగా యానాం బైపాస్‌లోని ఫ్లాస్ ఐఓసీ యజమాని మల్లాడి రఘువంశీ, చైతన్యలు విజేతలుగా నిలిచారు. రన్నర్స్‌గా రాజబాబు, మహేశ్వరరావు నిలిచారు. ఈసందర్భంగా ఐఓసీ డివిజనల్ మేనేజర్ హెచ్.బుచ్చయ్య, మేనేజర్ చైతన్య, సేల్‌ఆఫీసర్ కె.వెంకటేష్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం యానాం అగ్నికుల క్షత్రియ కల్యాణమండపంలో ఐఓసీ డీలర్స్ ఆఫీసర్స్ సమావేశం జరిగింది. ఐఓసీ సంబంధించిన పలు అంశాలపై చర్చించుకున్నారు.అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డీలర్స్‌కు అవార్డులు అందజేశారు. యానాం రీజియన్ పరిధికి సంబంధించి యానాం బైపాస్‌లోని ఫ్లాస్ బంక్ నాలుగు అవార్డులను దక్కించుకుంది. ఈసందర్భంగా ఐఓసీ డివిజనల్ మేనేజర్ హెచ్.బుచ్చయ్య, మేనేజర్ చైతన్య, సేల్ ఆఫీసర్ వెంకటష్‌లు చేతుల మీదుగా ఐఓసీ ఫ్లాస్ బంక్ యజమాని మల్లాడి రఘువంశీ అవార్డులను అందుకున్నారు.

వైభవంగా సుబ్బాలమ్మ సేవ



అమలాపురం టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రావాలా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మ అమ్మవారి జాతర సేవా మహోత్సవం జిల్లా శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అమలాపురం హైస్కూలు సెంటర్‌లో శ్రీవిజయదుర్గమ్మ ఆలయం వద్ద శ్రీసుబ్బాలమ్మ అమ్మవారి గరగను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గరగ నృత్యాలు, మేళతాళాలతో గరగను ఊరేగించారు. అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, సంసాని బులినాని, దొమ్మేటి రాము, మట్టపర్తి నాగేంద్ర, వాసర్ల వెంకన్న, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా నాయకుడు కొప్పుల సత్తిబాబు, పట్టణ సీఐ పి.వీరబాబు, ఊటాల వెంకటేష్, బొలిశెట్టి శంకర్‌పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం

మలికిపురం,జూలై13(ఆంధ్రజ్యోతి):మలికిపురంఎత్తువంతెన వద్దనున్న హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి మోరికిచెందిన విశ్రాంత అధ్యాపకుడు వీరా కృష్ణమూర్తి కుమారులు రెడ్డినాయుడు, వెంకటస్వామి, సత్యకృష్ణ దంపతులు రూ.లక్ష అందజేశారు. గుండుబోగుల పెద్దకాపు, కటికిరెడ్డి మహేష్, బొక్కా గోవిందు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కోనసీమకు కేంద్రీయ విద్యాలయం మంజూరు

ముమ్మిడివరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోనసీమకు కేంద్రీ విద్యాలయం మంజూరైందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి పేర్కొన్నారు. ముమ్మిడివరంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఏడు ఎకరాల స్థల సేకరణకు మూడున్నర కోట్లు విడుదలైనట్లు హరీష్‌మాధుర్ తెలిపారు. ఇందుకు సహకరించిన మంత్రి లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కోనసీమలో మరిన్ని విద్యా సంస్థలు తీసుకువచ్చి కోనసీమ ప్రాంత ప్రజలకు స్కిల్‌డెవలప్మెంట్ అయ్యేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'శాలివాహనులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి'

అంబాజీపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): కుమ్మరి శాలివాహనుల సంఘీయులకు ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలని కుమ్మరి శాలివాహన సంఘం జిల్లా సమావేశం కోరింది. మాచవరంలోని శాలివాహన సంఘ భవనంలో దాలిపర్తి భీమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం మాట్లాడారు. శాలివాహన కార్పొరేషన్ ద్వారా అధికంగా నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి, సలహాదారుడు దొడ్డిపట్ల శ్రీనివాస్, మంతెన శ్రీనివాస్, వెల్ల శ్రీనివాస్, కొడమంచిలి సూరిబాబు, ఠానేలంక వెంకటేశ్వరరావు, ఏడిద నాగరాజు, పాలకొల్లు వెంకటరమణ, అంబటి సుబ్రహ్మణ్యం, ఆదుర్తి ఓమనమ్మశివాయ పాల్గొన్నారు. అనంతరం సంఘ గౌరవ అధ్యక్షులుగా వెల్ల త్రిమూర్తులు ఎన్నికయ్యారు.

దేవస్థానం కమిటీల్లో నాయీబ్రాహ్మణులకు చోటివ్వండి

ఐ.పోలవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): దేవస్థానం కమిటీల్లో నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మురమళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి ఆలయ కమిటీల్లో నాయీబ్రాహ్మణులకు చోటు కల్పించాలని కోరారు. కార్పొరేషన్ డైరెక్టర్లు యానాపు ఏసు, కొరుపోలు నూకరాజు, లంక రత్నారావు, సురవరపు నాగరాజు, రాష్ట్ర సాధికార సమితి డైరెక్టర్ మానుకొండ దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ర్యాలి లోవరాజు, మండల అధ్యక్షుడు రామేశ్వరపు శేషగిరి, శిలారపు సత్తిబాబు, కోట నూకరాజు, విన్నకోట ఏసుబాబు, విధులూరి కాళహస్తి, పావులూరి శ్రీనివాసరావు, చింతలపూడి సత్యబాబు, పేకేటి శ్రీను పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు విశాఖకు చెందిన తెలిదేవర శివశంకర్ రూ.20,116 విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు. దాతకు వేదాశీర్వాదం, స్వామివారి చిత్రపటం అందించి సత్కరించారు.

కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం

ముమ్మిడివరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి ముమ్మిడివరం కళాసాహితీ సంతాపాన్ని వ్యక్తం చేసింది. రవీంద్ర విద్యా సంస్థల్లో ఆదివారం పి.లక్ష్మీశ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో కళాసాహితి సభ్యులందరూ కోట చిత్రటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విత్తనాల వరప్రసాదరావు, పి.శివనాగరాజు, పీవీఎన్ వర్మ, ఎన్.అబ్బులు, ఏవీ సత్యనారాయణ, పి.విజయ్‌కుమార్, కె.వెంకటేశ్వరరావు, ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వేపచెట్టు దుర్గమ్మకు ఆషాఢం సారె



అమలాపురంటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం కల్వకొలను వీధిలో ప్రసిద్ధినొందిన శ్రీవేపచెట్టు కనకదుర్గమ్మ ఆలయంవద్ద ఆషాఢమాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మహిళలు 500కిలోల మిఠాయిలతో పాటు ఆరు కావిళ్లతో ఆషాఢం సారెను తీసుకుని మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో తిరుగుతూ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. తొలుత శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి నల్లావీధి,శ్రీదేవిమార్కెట్ సెంటర్, శ్రీసుబ్బాలమ్మ అమ్మవారి ఆలయం, మెయిన్ రోడ్డు, ముమ్మిడివరం గేటు, గనికమ్మఆలయం మీదుగా కల్వకొలనువీధికిచేరుకున్నారు. ఆడపడుచులు తీసుకువచ్చిన వివిధ రకాల పండ్లు, మిఠాయిలు, సారెను అమ్మవారికి సమర్పించారు. చలిమిడి పానకాలను నివేదన చేశారు.

నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

ముమ్మిడివరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం నుంచి సమ్మె చేపట్టారు. నగరపంచాయతీ ఔట్‌సోర్సింగ్ సంఘ ఉపాధ్యక్షుడు మొక్కవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగరపంచాయతీ కార్యాలయం ఎదుట శిబిరాన్ని ఏర్పాటుచేసి రిలే దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించని కారణంగా ఆదివారం నుంచి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. వీధిదీపాలు, తాగునీరు సరఫరా విభాగాల సేవలను కూడా నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఎన్.అరుణ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.అజయ్‌కుమార్, జి.రమేష్, వై.రమణ, జి.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, కె.శివ, ఎ.సత్తిబాబు, కె.గోవిందు, కె.శరత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుచ్చిబాబు పరామర్శ

ముమ్మిడివరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు అర్థాని శ్రీనివాసరావు తండ్రి చంద్రయ్య ఆకస్మికంగా మృతిచెందారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, టీడీపీ నాయకులు ఆదివారం శ్రీనివాస్‌ను పరామర్శించారు. చంద్రయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, తాడి నరసింహారావు, చిక్కాల అంజిబాబు, కురసాల శివబాబు, గుద్దటి వీరాస్వామినాయుడు, సానబోయిన మల్లికార్జునరావు పరామర్శించారు.

నేడు కాట్రేనికోనలో టీడీపీ సమావేశం

పాల్గొననున్న మంత్రి కొల్లు రవీంద్ర

కాట్రేనికోన, జూలై 13(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన గ్రంధి నాగేశ్వరరావు ఫంక్షన్ హాలులో సోమవారం తెలుగుదేశం పార్టీ సమావేశం జరగనుంది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొంటారని పార్టీ నాయకులు ప్రకటించారు. ఈసమావేశంలో పార్టీ బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం అనంతరం పల్లంలో జరిగే తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు.

జగ్జీవన్‌రామ్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానాలు

అమలాపురం రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): నడిపూడి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం జిల్లాలోని పలువురు అధికారులను, ప్రతిభా వంతులను డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఏపీఈపీడీసీఎల్ కోనసీమ జిల్లా సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ విశాఖపట్నం సీజీఎంగా పదోన్నతిపై వెళ్లిన సిద్దెల రాజబాబు దంపతులను తొలుత సత్కరించి మెమోంటో అందజేశారు. అదేవిధంగా అమలాపురం తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, విద్యుత్‌శాఖ ఈఈ వై.విజయానంద్, అమలాపురం ఈఈ కె.రాంబాబు, రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు, బోయిలపల్లి కరుణాకర్, పెద్దాపురం ఏఈ కాప రామచంద్రరావు, ఉద్యోగ విరమణ చేసిన సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ నవరపు నాగేశ్వరరావు, రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన మంద మౌనిక, ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రథమ బహుమతి సాధించిన నీలి కావ్యను సత్కరించి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, టీడీపీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పొలమూరి సత్యనారాయణ, మడికి శ్రీరాములు, కాప నాగభూషణం, చాట్ల సత్యనారాయణ, తొత్తరమూడి ప్రభాకరరావు, మోకాటి అమ్మిరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



మామిడికుదురు, జూలై 13(ఆంధ్రజ్యోతి): గోగన్నమఠం గ్రామంలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. 48ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు గోగన్నమఠం గ్రామంలోని వైనతేన నదీతీరంలో ఉన్న ఓ రిసార్టులో సందడి చేశారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఆందోత్సాహాలతో గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను దుశ్శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. స్కూలును అభివృద్ధి పరుస్తామని తెలిపారు. నిర్వాహకులు సాగి పీఆర్‌వీఎస్ఎస్ నరసింహవర్మ, బొలిశెట్టి జయప్రకాష్, అప్పారి వెంకటేశ్వరరావు, కొంబత్తుల గంగాభవానీ, సాగి సత్యనారాయణరాజు, అప్పారి సూర్యనారాయణ, వడ్డి సునీత, బొలిశెట్టి జయరామ్, భాగవతుల లక్ష్మి పాల్గొన్నారు.

'రాజ్యాంగంపై మతశక్తుల దాడి'

మలికిపురం,జూలై 13(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉద్యమంలో వచ్చిన ఆశయాలు, లక్ష్యాల సాధనలో భాగమే లౌకికవాదం, సామ్యవాదమని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు యేడిద రాజేష్ అన్నారు. ఆదివారం మలికిపురం పూలే అంబేడ్కర్ భవన్‌లో రాజ్యాంగంపై జరిగిన మత శక్తులదాడి-ప్రతిఘటన ఆవశ్యకతపై చర్చావేదిక కార్యక్రమంలోఆయన మాట్లాడారు. సామ్యవాదం, లౌకికవాదం పదాలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు కొట్టి వేసినప్పటికీ ఆర్ఎస్ఎస్ నాయకులు వాటి గురించి మాట్లాడడం ప్రజల్లో గందరగోళం సృష్టించడమేనన్నారు. చర్చావేదికలో జనిపల్లి సత్యానందం, పెన్మెత్స సుబ్బరాజు, బూసి జాన్‌మోషే, ముత్యాల శ్రీనివాసరావు, బత్తుల లక్ష్మణరావు, ఆకుమర్తి భూషణం, నల్లి ప్రసాద్, మంద సత్యనారాయణ పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

లంక పొలాలకు చేరుతున్న వరదనీరు

రావులపాలెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీరుతో పల్లపు లంక ప్రాంతాలు ముంపుబారిన పడుతున్నాయి. మండలంలోని గౌతమి, వశిష్ట నదీ పరివాహక ప్రాంతంలో వరదనీరు అంతకంతకు చేరుతోంది. దీంతో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న లంక పొలాల్లోకి వరదనీరు చేరుతుండటంపై రైతుల్లో ఆందోళన నెలకొంది. అదే విధంగా గౌతమి, వశిష్ట వంతెనల వద్ద వరద నీరు పోటెత్తి ప్రవహిస్తున్నది.



గోపాలపురం వశిష్ఠ వంతెన వద్ద పోటెత్తి ప్రవహిస్తున్న గోదావరి



కె.గంగవరం మండలంలో శాకంబరి అమ్మవారిగా ఉమాపార్వతీదేవి. పక్క చిత్రంలో మండపేటలో ప్రత్యేక అలంకరణలో ఉన్న పోలేరమ్మ

శాకంబరి అవతారంలో గ్రామదేవతలు

కె.గంగవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామ దేవత పుట్టాలమ్మవారిని ఆదివారం భక్తులు శాకంబరి అమ్మవారిగా అలంకరించారు. పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు, నిమ్మపండ్లతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. మహిళలు ఆషాడం సారెను అమ్మవారికి సమర్పించారు. స్థానిక శివాలయంలో ఉన్న ఉమా పార్వతీ దేవిని శాకంబరి దేవిగా అలంకరించి పలు ప్రత్యేక పూజలు చేశారు.

మండపేటలో...

మండపేట, (ఆంధ్రజ్యోతి): జెడ్.మేడపాడు లోనున్న గ్రామదేవత పోలేరమ్మ ఆషాడ మాసం సందర్భంగా పలు కూరగాయాలతో ప్రత్యేకంగా అలకరించారు. భక్తులకు శాకంబరి దేవిగా అమ్మవారు దర్శనం ఇచ్చారు.

వాడపల్లి ఆదాయం రూ.7.77 లక్షలు

ఆత్రేయపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.7,77,000 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన పి.మధుసూధన్, కిరణ్ దంపతులు రూ.51,111 విరాళం ఇచ్చారు. దాతలకు ఈవో స్వామివారి చిత్రపటం అందజేశారు.



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

కొత్తపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దోమలు వ్యాప్తి చెంది పలువురు జ్వరాలబారిన పడినట్టు తెలిసింది. జ్వర పీడితులు వానపల్లి పీహెచ్‌సీ, అవిడి పీహెచ్‌సీ, కొత్తపేట వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నట్టు సమాచారం. ఆయా గ్రామాల్లోని మురుగుకాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే మురుగునీరు రోడ్లపైకి వచ్చేస్తోందని స్థానికులంటున్నారు. నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెంది టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, అతిసార, కామెర్లు వంటి రోగాలబారినపడు పడుతున్నారని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో అపారిశుధ్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

అడిషినల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుమలత

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలి. కాచిచల్లార్చిన నీటిని తాగడంతో పాటు వేడి పదార్థాలను తీసుకోవాలి. రెండు, మూడు రోజుల్లో జ్వరం తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలి.



పీవీఆర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ద్రాక్షారామ, జూలై 13(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ పీవీఆర్ ఉన్నత పాఠశాల 1989-1990 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆహ్లాద వాతావరణంలో జరిగింది. ముందుగా పాఠశాలలోని సరస్వతి విగ్రహం వద్ద పూజలు జరిపారు. అనంతరం ర్యాలీగా సాయిమాధవానంద ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. అనంతర పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అప్పటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో స్థిరపడని పలువురికి అండగా నిలవాలని సంకల్పించారు. కార్యక్రమానికి ఫ్లోరిడాలో స్థిరపడిన రమేష్, భాగవతి గోపి హాజరయ్యారు. సర్పంచ్‌లు నాగిరెడ్డి సతీష్‌రావు, టేకుమూడి సుజాత, మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని తోట పుండరీకాక్షులు, యండమూరి ఈశ్వరరావు, సంగీతం రామకృష్ణ, పంపన గోవిందు, రాజేశ్వరి, టేకుమూడి సత్యనారాయణ, ధనలక్ష్మి, నాగు, భాను తదితరులు నిర్వహించారు.

ఉచిత మెగా వైద్య శిబిరంలో

పలువురికి పరీక్షలు

ఆత్రేయపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం రావిచెట్టు సెంటర్ వద్ద ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రావులపాలెం కేఎస్ఎల్ మల్టీ స్పెషాల్టీ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు ఎన్.సందీప్‌రెడ్డి, ఎం.అనూష ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 1100 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాదిరాజు ప్రసాదరాజు, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

తామరపల్లిలో..

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. దీన్ని గోలి సూర్యనారాయణ, రామసీత దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. శిబిరంలో డాక్టర్ గోలి మాణిక్య వెంకట కాశీరామ్, డాక్టర్ బెల్లంకొండ రాజశేఖర్ శిబిరంలో 300 మందికి పలు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరం నిర్వహణలో గోలి సత్యనారాయణ మూర్తి, సీతారత్నం, గోలి శ్రీలక్ష్మి, సాయిశ్రీ శ్రావణి, గోలి రవిచంద్రుడు కృషి చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు నెక్కంటి బాలకృష్ణ, గన్ని శ్రీనివాసు, సర్పంచ్ టి.మంగ, టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నరసింహారావు

సందీప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో సందీప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని రాజమహేంద్రవరం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్పీ కొండా నరసింహారావు ప్రారంభించారు. శిబిరంలో సుమారు 165 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐక్లినిక్ ఆధ్వర్యంలో 128 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 22 మందికి ఆపరేషన్ అవసరం కాగా అకిరా ఆసుపత్రి రాజమహేంద్రవరం పంపించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు బండారు చిట్టిబాబు, శిల్పి రాజకుమార్ వడయార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో మాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా స్వామివారి

మాసకల్యాణం

ఆత్రేయపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహ వచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదిక వద్దకు స్వామివారిని తీసుకువచ్చి శోభాయమానంగా కల్యాణం జరిపారు. అశేష భక్తజనం పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి వీటి ఏర్పాట్లు నిర్వహించారు.



రాజవరంలో విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

విద్యుత్ సమస్యకు పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్రేయపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం రాజవరంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదంగా మారిన నేపథ్యంలో ఆదివారం ఆంధ్రజ్యోతిలో కిందపడే వరకు పట్టించుకోరా శీర్షికన వెలువడిన కథనంపై ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు ట్రాన్స్‌కో ఏఈ టి.అశోక్ రాజవరంలో ఒరిగిన విద్యుత్ స్తంభం, పిచ్చితీగలతో అల్లుకున్న మరో స్తంభం వద్ద సిబ్బందితో వెళ్లి సమస్యను పరిష్కరించారు.

సినీనటుడు కోట మృతికి సంతాపం

మండపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినిమా రంగానికి తీరని లోటని పట్టణ బ్రాహ్మణ సంఘం నాయకులు అన్నారు. ఆయన మృతి నేపథ్యంలో ఆదివారం బ్రాహ్మణ సత్రంలో సంఘం అత్యవసర సమావేశం జరిగింది. దీనికి బ్రాహ్మణ సంఘ నేతలు మాట్లాడుతూ చిత్రపరిశ్రమతోపాటు ఎమ్మెల్యేగా ఆయన రాజకీయాల్లో రాణించారన్నారు. ఆయన మృతిపట్ల బ్రాహ్మణ సంఘ నాయకులు కడియాల ప్రసాద్, కేసరి విద్యాసాగర్, శివకోటి శేష సుబ్రహ్మణ్యం, ఏడిద సూర్యనారాయణ, భాస్కర కామరాజు తదితరులు సంతాపం తెలిపారు.

ర్యాలి వంతెన, రహదారి

నిర్మాణానికి ప్రతిపాదనలు

ఆత్రేయపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి శిథిలస్థితికి చేరుకుని ఇరుకుగా ఉన్న ర్యాలి వంతెన నిర్మాణం, ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఆదివారం గ్రామస్థుల వినతి మేరకు శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. బ్రిడ్జి నుంచి గుడి వరకు, ఆంజనేయస్వామి గుడి నుంచి బుల్లియ్యరేవు వరకు బ్రిడ్జి నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. ర్యాలి గ్రామంలో చేపట్టాల్సిన ఆయా పనులపై ప్రత్యేక ప్రణాళిక ద్వారా చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పెండెం వెంకన్న, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తాడాల పండు, బందెల ప్రసాద్, నరాలశెట్టి వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అంగరలో ఉన్న వైభవ వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్ర పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు, అభిషేకాలు, కలశపూజ తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆలమూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): చొప్పెల్ల పీహెచ్‌సీకి గుర్తు తెలియని వ్యక్తి వైద్యం నిమిత్తం వచ్చి మృతి చెందినట్లు ఆలమూరు పోలీసులు తెలిపారు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ అందించిన సమాచారం మేరకు చొప్పెల్ల పీహెచ్‌సీకి శనివారం సాయంత్రం చికిత్స నిమిత్తం వస్తూనే ఆసుపత్రి బయట పడిపోవడం గమనించిన ఆసుపత్రి సిబ్బంది లోనికి తీసుకెళ్లి చికిత్స అందించే ప్రయత్నం చేయగా ఆవ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఈయన ఎవరో తెలియదని ఈయన వయస్సు సుమారు 45ఏళ్లు ఉంటాయని నలుపు రంగు చారల టీషర్టు ఉన్నట్లు తెలిపారు. ఆసుపత్రి వైద్యాధికారిని ఎస్.లక్ష్మీస్నేహలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మండపేట మార్చురీకి తరలించామని అక్కడ మూడు రోజుల పాటు ఉంచనున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. బంధుమిత్రులు ఎవరైన గుర్తించేందుకు మండపేట ఆసుపత్రి వెళ్లి గుర్తించవచ్చునని ఆయన కోరారు.

భక్తులతో కిటకిటలాడిన చిన్నతలుపులమ్మ లోవ

రాయవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి):పసలపూడి శివారులో ఉన్న చిన్నతలుపులమ్మ అమ్మవారి లోవ భక్తులతో కిటకిటలాడింది. ఆషాడమాసం ఆదివారాన్ని పురస్కరించుకుని రాయవరం, రామచంద్రపురం, మండపేట, అనపర్తి పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.



శిథిలావస్థకు చేరుకున్న ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ. పక్క చిత్రంలో భవనాలను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్ (ఫైల్‌ఫొటో)

ఇలా ఉంటే...చదివేదెలా?

- ఆందోళన కలిగిస్తున్న ఆలమూరు జూనియర్ కాలేజీ భవనాలు
- వాడొద్దని రెండు దశాబ్దాల క్రితమే చెప్పిన ఆర్అండ్‌బీ అధికారులు
- ఆందోళనలో ఇంటర్ విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆలమూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఇక్కడి భవనాలను రెండు దశాబ్దాల క్రితమే ఉపయోగించవద్దని ఆర్అండ్‌బీ అధికారులు చెప్పినప్పటికీ అదే భవనాల్లో ఇంటర్ క్లాసులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీపై భయాందోళనలు చెందుతున్నారు. 1917లో ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోసం ఇక్కడ నిర్మించారు. 1978లో ఆలమూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రారంభించారు. అప్పట్లో హైస్కూల్‌కు చెందిన భవనాలను ఇంటర్మీడియట్‌కు కేటాయించి హైస్కూల్‌కు అదనపు తరగతి గదులు నిర్మించారు. అప్పటి నుంచి ఇదే భవనాల్లో ఇంటర్ క్లాసులు నడుస్తున్నాయి.

వెనుదిరిగిన విద్యార్థులు: ఈ ఏడాది ఇంటర్‌లో చేరడానికి వచ్చిన పలువురు విద్యార్థులు భవనాల దుస్థితిని చూసి భయంతో వెనుదిరిగారు. ఈ ఘటనను బట్టి చూస్తే కాలేజీ భవనాలు ఎంత ప్రమాదంగా ఉన్నాయో అర్థమవుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఓఎన్జీజీ పనులతో ధ్వంసమైన భవనాలు: ఆలమూరు పరిసర ప్రాంతాల్లో 1992 నుంచి ఓఎన్‌జీసీ కార్యకలాపాలు ప్రారంభించింది. చమురు, గ్యాస్ అన్వేషణలో సర్వేలో అక్కడ బాంబులను పేల్చడం వల్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనాలతోపాటు అనేక ఇళ్లు శిథిలమయ్యాయి. ఆయా భవనాల గోడలు బీటలువారి దెబ్బతిన్నాయి. ఆలమూరు హైస్కూల్ కోసం వందేళ్ల క్రితం నిర్మించిన భవనాలు కాబట్టి బీటలు వారినా అలాగే కొనసాగిస్తున్నారు. కాలేజీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించి ఇంటర్ క్లాసులు నిర్వహిస్తున్నారు.

రెండు దశాబ్దాల క్రితమే చెప్పిన ఆర్అండ్‌బీ అధికారులు: ఇక్కడి భవనాలు శిథిలావస్థకు చేరాయని, ఇందులో క్లాసులు నిర్వహించడం శ్రేయస్కరం కాదని రోడ్లు భవనాలశాఖ అధికారులు పలుసార్లు స్పష్టం చేశారు. అయినప్పటికీ కొత్త భవనాల నిర్మాణానికి నిధుల కొరత కారణంగా క్లాసులను కొనసాగిస్తున్నారు. ఈ భవనాల్లో క్లాసులు నిర్వహించడం ప్రమాదమని అనేక సార్లు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన జరిపినా ఫలితం దక్కలేదు.

శిథిల భవనాలపై పలువురు ఫిర్యాదులు: ఆలమూరు జూనియర్ కాలేజీ భవనాల దుస్థితిపై కాలేజీ అభివృద్ధి కమిటీ, పలు స్టూడెంట్ యూనియన్ నాయకులు ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ ఆధ్వర్యంలో భవనాలను పరిశీలించారు. భవనాల దుస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆయన తెలిపారు.



మండపేటలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల. పక్క చిత్రంలో ర్యాలిలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బండారు

కూటమి పాలనలో ఎంతో అభివృద్ధి

సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు

మండపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): కూటమిపాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా దూసుకుపోతోందని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో ఆదివారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఆయా వార్డుల్లో ఇంటింటా పర్యటించారు. ప్రభుత్వ పాలన, పథకాలపై ప్రజలకు వివరించారు. ఆయా వార్డుల్లోని కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక నాయకులతో పాటు టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, చుండ్రు సోమరాజు, జొన్నపల్లి సూర్యారావు తదితరులు వున్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే ఎన్నికల హామీలను అమలు చేసి విజయం సాధించినట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ర్యాలిలో ఆదివారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సమితి అధ్యక్షులు మద్దురి సుబ్బారావు, మాజీ సర్పంచ్ పేరిచర్ల పుల్లంరాజువర్మ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పెండెం వెంకన్న, మెర్ల నాగేశ్వరరావు, సత్తిబాబు, పాలంగి రవిచంద్ర, గార్లపాటి గోపి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత ప్రభుత్వానిదే

ఎంపీ హరీష్, మంత్రి సుభాష్

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హమీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం వారు పామర్రు, యండగండి గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గ్రామంలో దివంగతనేత పిల్లి అప్పారావు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. సుపరిపాల తొలి అడుగు కర పత్రాలు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, టీడీపీ నాయకులు మరివాడ సూరిబాబు, మేడిశెట్టి రవికుమార్, కోటిపల్లి వీర్రాఘవులు చౌదరి, ఎనుముల గోపాలకృష్ణ, మరివాడ చిన్ని కృష్ణ, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, మార్ని శ్రీధర్, చిట్టూరి రామ్మోహన్‌రావు, సలాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరం మండలం పామర్రులో సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలు అందజేస్తున్న ఎంపీ హరీష్, మంత్రి సుభాష్

మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యం

మంత్రి సుభాష్



జ్యూట్ బ్యాగుల తయారీ టూల్స్ కిట్లను అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 13 (ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని మంత్రి సుభాష్ తెలిపారు. ఆదివారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి కల్పన సంస్థ సహకారంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ తరగతులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి కల్పనకు పలు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే కుట్టు, ఎంబ్రాయిడరీ శిక్షణ, బ్యూటీషియన్ కోర్సు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందే మహిళలకు టూల్స్ కిట్స్‌ను అందచేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి కల్పన సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల వద్ద పిచ్చిమొక్కలు

మండపేట, జూలై, 13(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గొల్లపుంత కాలనీలో నిర్మించిన టిడ్కో గృహాల సముదాయం ఫేజ్1లో లబ్ధిదారులకు అందించగా ఫేజ్ 2లో గృహాలు నేటికీ లబ్ధిదారులకు అందలేదు. వైసీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహాలకు రంగులు మార్చారే తప్ప నేటి వరకు ఆయా ఇళ్లను పేదలకు పంపిణీ చేయలేదు. వైసీపీ ఐదేళ్లలో ఎటువంటి పురోభివృద్ధి జరగలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఫేజ్2 సంబంధించిన ఇళ్ల మధ్య చిట్టడివిని తలపిం చేలా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని పలు వురు వ్యాఖ్యానిస్తున్నారు. ఫేజ్1లో నివాసం ఉండే లబ్ధిదారులు పిచ్చిమొక్కల కారణంగా పలు రకాల విషసర్పాలు తిరుగుతున్నాయని వారు భయాందోళన చెందుతున్నారు. అపార్ట్ మెంట్‌పై భాగంలో ఉండే వాటర్ ట్యాంకుల నిచ్చెనలు పాడవటం, ఇళ్లల్లో శ్లాబుల నుంచి లీకులు కారడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. సొమ్ములు చెల్లించినా ఇంకా తమకు ఫేజ్ 2లో ఇళ్లను ఇవ్వలేదని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి కైనా కాలనీలో మౌలిక వసతులు కల్పించి ఇళ్లను తమకు పంపిణీ చేయాలని లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



గొల్లపుంతకాలనీలో టిడ్కో గృహాల సముదాయం వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

శ్రీనివాసరావు మృతికి సంతాపం

మండపేట, జూలై, 13(ఆంధ్రజ్యోతి) ఆర్తమూరు పంచాయతీ 7వ వార్డు సభ్యుడు గుండెపోటుతో మరణించటం బాధాకరమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. శ్రీను చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట స్థానిక నేతలు నల్లమిల్లి వీర్రెడ్డి, పడాల సుబ్బారెడ్డి, పంచాయతీ ఉపసర్పంచ్ కర్రి జంబయ్య, బాబులురెడ్డి, మల్లిడి సత్తిరాజు చిర్ల వాసు, పంచాయతీ సభ్యులు తదితరులు వున్నారు.

ఆలమూరు మండలంలో

సహకార సారథులు వీరే

ఆలమూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించారు. ఆలమూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా వంటిపల్లి వీరవెంకటసతీష్ కుమార్, సభ్యులుగా రామానుజుల సూర్యప్రకాష్, జి.నాగవెంకట్రావు నియమితులయ్యారు. చింతలూరు సహకార సంఘం అధ్యక్షుడిగా నల్లా వెంకటేశ్వరరావు, సభ్యులుగా బుంగ చినఅబ్బులు, కడలి రమేష్ నియమితులయ్యారు. చొప్పెల్ల సహకార సంఘం అధ్యక్షుడిగా నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, సభ్యులుగా నాగిరెడ్డి స్వామి, పంపన సురేష్ నియమితులయ్యారు. జొన్నాడ సహకార సంఘం అధ్యక్షుడిగా మేడపాటి రామారెడ్డి, సభ్యులుగా రేలంగి సత్యనారాయణ, యాళ్ల చంద్రశేఖర్ నియమితులయ్యారు. మోదుకూరు సహకార సంఘం అధ్యక్షుడు ఈదల వీర్రాజు, సభ్యులు కొత్తగళ్ల గోపీకృష్ణ, తాతపూడి చినజానకయ్య నియమితులయ్యారు. నర్సిపూడి సహకార సంఘం అధ్యక్షుడిగా రాయుడు వెంకటస్వామి, సభ్యులుగా కండిబొట్ల బాలాజీ, డీవీ రాజు నియమితులయ్యారు. పెదపళ్ల సహకార సంఘం అధ్యక్షుడిగా జాస్తి భాస్కరరావు, సభ్యులుగా మోటిపల్లి శ్రీనివాసరావు, కత్తుల రాజశేఖర్ నియమితులయ్యారు. పెనికేరు సహకార సంఘం అధ్యక్షుడిగా మేకా రామన్న, సభ్యులుగా వాసంశెట్టి వెంకటరమణ, సలాది గోవిందరాజులను నియమించారు. ఒకటి రెండు రోజుల్లో త్రిసభ్య కమిటీలు బాధ్యతలు స్వీకరించనున్నారు.